భవితవ్యం.. మరికొద్ది గంటల్లోనే..

- మేడ్చల్ 14వ ఎమ్మెల్యే ఎవరు..?
- ప్రధానంగా పోటీ ఆ ఇద్దరి మధ్యే..
- ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్న మల్లారెడ్డి, వజ్రేష్‌యాదవ్
- మధ్యాహ్నం వరకు గెలుపుపై స్పష్టత




మేడ్చల్: పోటాపోటీగా జరిగిన ఎన్నికల ఫలితాలు ఆదివారం విడుదల కానున్నాయి. మేడ్చల్ ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని అధికారులు కీసర మండల భోగారంలోని హోలిమేరి కళాశాలలో ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే లెక్కింపు మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగియనుంది. ఫలితం 12 గంటలలోపే రానుంది.

ప్రధానంగా ఇద్దరి మధ్యే పోటీ

మేడ్చల్ నుంచి ఎమ్మెల్యే కోసం 22 మంది పోటీచేసినా ప్రధానంగా ఇద్దరి మధ్య పోటీ నెలకొంది. బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ మధ్య పోటీ కన్పించింది. విజయంపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. తమకు పడిన ఓట్లపై ఎవరి లెక్కలు వారు వేస్తున్నారు. పోలైన ఓట్లలో 80 శాతం ఓట్లు తమవే అని బీఆర్ఎస్ ధీమాగా ఉండగా, చాపకింద నీరులా ఓట్లన్నీ తమకే వచ్చాయని బీజేపీ నాయకులు, విజయానికి కావాల్సిన ఓట్లు ఈవీఎంలలో నిక్షిప్తమయ్యాయని, బీసీ ఓట్లు, మల్లారెడ్డి వ్యతిరేఖ ఓట్లు తమకే గంపగుత్తగా పడ్డాయని కాంగ్రెస్ నాయకులు ధీమాతో ఉన్నారు. మరికొద్ది గంటల్లో రానున్న ఫలితం తమకంటే తమకే అనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

14వ ఎమ్మెల్యే ఎవరో..?

మేడ్చల్ 1952 ఏర్పడగా మొదటిసారి గోపాల్‌రెడ్డి(కాంగ్రెస్), 1962 రెండవసారి రాంచంద్రరావు(స్వతంత్ర), మూడవసారి 1972లో సుమిత్రాదేవి(స్వతంత్ర), 1978లో మర్రి చెన్నారెడ్డి(కాంగ్రెస్) 1983, 1989లో ఉమాదేవి(కాంగ్రెస్), 1985లో సురేందర్‌రెడ్డి(టీడీపీ), 1994, 1999, 2004లో దేవేందర్‌గౌడ్(టీడీపీ), 2009లో కేఎల్ఆర్(కాంగ్రెస్), 2014లో సుధీర్‌రెడ్డి(బీఆర్ఎస్), 2018లో మల్లారెడ్డి(బీఆర్ఎస్)లు మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. తాజాగా ఎవరు 14వ ఎమ్మెల్యేగా మేడ్చల్‌కు పని చేయనున్నారో తేలనుంది.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశాం..

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మూడంచెల భద్రతతో కీసర మండలం భోగారంలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, ఆ వెంటనే ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. జిల్లాలో 9,889 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నారన్నారు. ఓట్ల లెక్కింపు విధుల్లో 508 మంది సిబ్బంది పాల్గొంటుండగా, ఒక టేబుల్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపులో కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్‌వైజర్, మైక్రోఅబ్జర్వర్ ఉంటారన్నారు. వీరందరికీ రెండు పర్యాయాలు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు.

ప్రతి టేబుల్‌కు మైక్రో అబ్జర్వర్..

ఐదు నియోజకవర్గాలకు 2,439 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 105 రౌండ్లకు గానూ 116, టేబుళ్లను ఏర్పాటు చేశారన్నారు. ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు కూడా 11 ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి టేబుల్‌కు మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ప్రతి టేబుల్ వద్ద సంబంధిత పార్టీ ఏజెంట్లతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉంటారని, కౌంటింగ్ అంతా సీసీ కెమెరాల నిఘా నీడలో పటిష్ట భద్రత నడుమ కొనసాగుతుందన్నారు. ఈవీఎంల కౌంటింగ్ పూర్తయ్యేలోపు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారన్నారు. ఒకవేళ ఈవీఎంల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేలోగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తి కాకుంటే, చివరి రౌండ్ ఈవీఎంల లెక్కింపును నిలిపేసి, పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారన్నారు. ఆ తర్వాతే చివరి రౌండ్ ఈవీఎంల లెక్కింపు చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియలో కౌంటింగ్ సిబ్బంది

కలెక్టరేట్‌లో శనివారం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్, అమన్ మిట్టల్, కౌంటింగ్ ప్రత్యేక అబ్జర్వర్లు హిమన్షు వర్మ, దశరథ్ దెబ్బర్మ, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ఎన్నికల కౌంటింగ్ సిబంది సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఐదు శాసనసభ నియోజక వర్గాలకు సంబంధించి మొత్తం 2439 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 508 కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందులో కౌంటింగ్ పర్యవేక్షకులు 161 మంది, కౌంటింగ్ అసిస్టెంట్స్ 177 మంది, మైక్రో అబ్జర్వర్లు 170 మంది ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులతో పాటు రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయయాత్రలో ప్రముఖ పాత్ర నైపుణ్యానిదే..

- ప్రొఫెసర్ సత్యనారాయణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

ఘట్‌కేసర్: ఉద్యోగ అవకాశాల కోసం విద్యార్థులు నూతన కోర్సులు, ఆధునిక సాంకేతికతపై దృష్టి సారించాలని ఇండియన్ కామర్స్ ఈయూ చాంబర్ కౌన్సిల్ కో చైర్మన్ సత్యనారాయణ అన్నారు. కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శనివారం నిర్వహించిన 'స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసమే కాకుండా బంగారు భవిష్యత్ కోసం, ఆచరణాత్మక నైపుణ్యం పెంపొందించుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ స్కిల్ డెవలప్‌మెంట్ నిపుణుడు దర్పణ్ వాసుదేవ్, సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉదయ్‌కిరణ్, సంస్కృతి విద్యాసంస్థల కార్యదర్శి మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలం సింగ్, ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

కీసర: భోగారం హోళీమేరి కళాశాల్లో ఆదివారం ఉదయం ఐదు అసెంబ్లీ(మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, కూకట్‌పల్లి)ఎన్నికలకు సంబందించి ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని కీసర సీఐ వెంకటయ్య తెలిపారు. కీసర మీదుగా వయా భోగారం మీదుగా ఘట్‌కేసర్ వెళ్లే వాహనాలను భోగారం వయా ఓఆర్ఆర్ సర్వీస్ రహదారి మీదుగా ఘట్‌కేసర్ చేరుకునే విధంగా వాహనాల మళ్లింపు ఉంటుందని, అదేవిధంగా ఘట్‌కేసర్ నుంచి భోగారం వయా కీసరకు చేరుకునే వాహనాలను ఘట్‌కేసర్ వయా ఓఆర్ఆర్ సర్వీస్ రహదారి మీదుగా కీసరకు చేరుకునే విధంగా వాహనాల మళ్లింపు ఉంటుందని, ఈ రహదారుల మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని, ఆదివారం ఉదయం 6 గంటల నుండే ఈ ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు.

ఎన్నికల విజయోత్సవాలపై నిషేధం

- సీఐ మహేందర్‌రెడ్డి



ఘట్‌కేసర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఆదివారం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, విజయోత్సవ ర్యాలీలు, రాజకీయ వేడుకలు నిర్వహించరాదని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఫలితాల అనంతరం భాణాసంచా కాల్చరాదని, సాంస్కృతిక కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు, డీజే, బ్యాండ్ సౌండ్ చేయరాదన్నారు. గుంపులుగా తిరగడం, ఓడిన పార్టీ అభ్యర్థుల కార్యకర్తలను అపహాస్యం చేయడం, ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు పాల్పడటం, అవహేళన చేయరాదన్నారు. సామాజిక మాధ్యమాల్లో అభ్యంతకర పోస్టులు పెట్టరాదని, గెలిచిన అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు విజ్ఞత పాటించాలని కోరారు.

రామలింగేశ్వర స్వామి సేవలో..



కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి సేవలో శనివారం మేడ్చల్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఐఏఎస్ అధికారిణి పూర్వాగార్గ్ పాల్గొన్నారు. సాయంత్రం కీసరగుట్టకు చేరుకున్న ఆమెకు ఆలయ వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారి(శివలింగం) ప్రత్యేక పూజల అనంతరం ఆలయ వేదపండితులు ఆమెకు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్ ఆలయ విశిష్టతను తెలియజేశారు.

ఘనంగా ఉర్సు



చాదర్ సమర్పణ అనంతరం ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మేడ్చల్: పట్టణంలోని హజ్రత్ జిందా షా మాధార్ రహమతుల్లా అలై దర్గాలో ఉర్సు ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సందల్(గంధం) దర్గా షరీఫ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి చాదర్‌ను సమర్పించారు. చాదర్ సమర్పణ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు లాయక్‌అలీ, మహమ్మద్ అబ్దుల్ బారీ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన



బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన జీవన్ సాగర్ ఎగ్జిబిషన్ ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా నిత్యం తిలకిస్తూ ఆనందాన్ని పొందుతున్నారు. నిత్యం బిజీగా ఉండే నగర శివారు ప్రజలు ఆట విడుపుగా ఎగ్జిబిషన్‌కు వచ్చి ఎంజాయ్ చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నారాయణ వెల్లడించారు. జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్, సోలాంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్ ఎంతో ఆకట్టుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళలు, యువతులతో నిత్యం జ్యూవలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, స్టాయిల్స్ స్టాల్స్, డ్రైఫ్రూట్స్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్స్ స్టాల్స్‌ను సందర్శించి అవసరం ఉన్న వారు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా అండర్ వాటర్ టన్నెల్ ఆక్వేరియ్ మొదటిసారి ఏర్పాటు చేయడం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఇది అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటోంది. నీటి అడుగున సొరంగ ప్రదర్శన, రెండు వేల చేపలతో ప్రత్యేక ఆకర్షణీయంగా ఉందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్న ఈ జీవన్ సాగర్ ఎగ్జిబిషన్‌ను బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, పోచారం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బృహదీశ్వర స్వామి అలంకరణలో..

గౌతంనగర్: కార్తీక మాసం సందర్భంగా వాణీనగర్ విజయ వినాయక ఆలయంలో శనివారం బృహదీశ్వర స్వామి(తంజావూరు) అలంకరణలో ఉమామహేశ్వర స్వామిగా భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు.

నృత్యం.. మనోహరం..



ఉప్పల్: ఉప్పల్ శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా అర్చన గూటి శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పలు అంశాలను భవ్య, సహస్ర, కృతి, కీర్తన, హంసిని, ప్రవళిక ప్రదర్శించి మెప్పించారు. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, ఆట డాన్స్ అకాడమి డైరెక్టర్ విజయ్ కుమార్ విచ్చేసి కళాకారులను అభినందించారు.

మానసిక ప్రశాంతతకు మార్గం ఆధ్యాత్మిక చింతన



మల్కాజిగిరి: మానవ జీవితంలో ప్రశాంతతకు ఆధ్యాత్మిక చింతన ఒక మార్గంలా ఉపయోగపడుతుందని మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 23వ తేదీ మల్కాజిగిరి బృందావన్ గార్డెన్స్‌లో జరిగ్దేది ్వతీయ వార్షిక ద్వాదశ ఆవృతి సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చింతన పెంపొందించడం కోసం ఇటువంటి సామూహిక కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ప్రాశ్చాత్య దేశాల్లో రోగులు త్వరగా స్వాంతన పొందడానికి లలితా సహస్ర నామపారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం వినిపిస్తున్నారని సైంటిఫిక్‌గా రుజువైందన్నారు. భావి తరాల్లో కూడా మన పిల్లలకు వీటిని ఉచ్చరించడం నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దుర్గారామ్, ప్రభుగుప్త, సుధాకర్‌గుప్త, సునీల్‌రెడ్డి, ఉష తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

బాలానగర్: జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాల విద్యార్థులు, యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారుల సౌత్ జోన్ వాలీబాల్ క్రీడాకారులు ఎంపిక జేఎన్‌టీయూహెచ్ క్రీడా ప్రాంగణంలో శనివారం వాలీబాల్ క్రీడాకారులను ఎంపిక చేశారు. పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ డా. ఎన్. దిలీప్, జేఎన్‌టీయు కాలేజీ ప్రిన్సిపాల్ డా. కె. విజయకుమార్ రెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడాకారులుగా మంచి ప్రావీణ్యం సంపాదించి మంచి క్రీడాకారులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు సహాయ సహకారాలు, సౌకర్యాలు కల్పిస్తున్నాయన్నారు.

ఆసక్తిగా సాగిన కాస్కేడ్..

సాక్షి, సిటీబ్యూరో: ఐఐటీ ఖరగ్‌పూర్ నిర్వహించే ఆసియాలో అతిపెద్ద వార్షిక టెక్నో మేనేజ్‌మెంట్ సింపోజియం క్షితిజ్‌లో భాగంగా ప్రిలిమ్స్ ఈవెంట్ కాస్కేడ్‌ను నగరంలోని విశ్వ విశ్వాని ఇనిస్టిట్యూషన్స్‌లో నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌ల రంగంలో నైపుణ్యాలను గుర్తించేందుకు ఆండిజిక్స్, గణితంలో ఆధిపత్యం గుర్తించే గణిత ఒలింపియాడ్ టాప్ కోడర్‌లను గుర్తించే సోర్స్ కోడ్, అధిక ఐక్యూ ఉన్న ఆలోచనాపరుడ్ని గుర్తించే క్వాంట్ ఫైనాన్స్ ఈవెంట్ ఎనిగ్మాలు జరిగాయి. వివిధ కళాశాలలకు చెందిన 500 మందికి పైగా విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు.

రక్తదాతల కోసం ప్రచార గీతం

సాక్షి, సిటీబ్యూరో: రక్తదాతల్ని ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ హెల్త్‌కేర్ లీడర్ అబాట్ బెఇ1 (బిఇటిహెచ్ఇ1) పేరిట ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఏటా మనకి అవసరమైన 14.6 మిలియన్ల రక్త యూనిట్లలో ఒక మిలియన్ యూనిట్ల కొరత ఉంటున్న నేపథ్యంలో రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ ।గివ్ బ్లడ్. గెట్ గుడ్ వైబ్స్₹ ప్రచార గీతాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పాట యువతను రక్తదానం వైపు ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని ప్రేరణ ఇస్తుందన్నారు. ప్రముఖ హిప్‌హాప్ కళాకారుడు, రాపర్, గీత రచయిత రంగస్థల ప్రదర్శనకారుడు ఎంసీ హెడ్‌షాట్‌గా పేరొందిన తమోజిత్ చటర్జీ స్వరాలు అందించారని వివరించారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

మల్లాపూర్: ఎన్నికల్లో ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని బీఆర్ఎస్ యూత్ నేత ఎస్వీ శశి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మల్లాపూర్‌లోని నందీశ్వరాలయంలో పూజలు చేశారు. బీఆర్ఎస్ యూత్ కమిటీ సభ్యులు పీఆర్, పృథ్వీ, సోను, ప్రేమ్, ప్రసాద్, చైతన్య, వెంకట్, అజయ్, రాజు, శ్రీధర్, రాజీ, ప్రసాద్, రిషీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూఫోని అకాడమిక్ ఫెస్ట్



నమూనాల గురించి వివరిస్తున్న విద్యార్థులు



ఫెస్ట్‌లో నమూనాలను తిలకించిన అతిథులు

పోచారం: యంనంపేట్‌లోని రాక్‌ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో యూఫోని అకాడమిక్ ఫెస్ట్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శాస్త్ర, సాంకేతిక, గణిత, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా ఫెస్ట్ కొనసాగింది. ఎలక్ట్రానిక్ ట్రాఫిక్ సిగ్నల్, రోమియో జూలియట్ నాటకం, ఫైర్ ఫైటింగ్ రోబో, బుర్రకథ ప్రదర్శన, థర్మల్ ఎలక్ట్రిసిటీ కన్వర్షన్, వృక్ష కణ నిర్మాణంతో పాటు పనిచేయు విధానం, తడి పొడి చెత్తను వేరు చేయడం, పైథాగరస్ సిద్ధాంతం, హర్రర్ గది, ఫొటో బూత్ వంటి నమూనాలను విద్యార్థులు ప్రదర్శించి ప్రతిభ కనబర్చారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ విద్యావేత్తలు అనిల్ ముతగోని, శైలజ భారటాల విచ్చేసి ఫెస్ట్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయురాలు శ్రీరంజని తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాలు



కాప్రా: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాలు మూడు రోజులుగా ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ మానసిక దివ్యాంగుల స్కూల్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. వివిధ వేషధారణలో విద్యార్థులు చేసిన పాత్రలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం కాప్రా, నేతాజీనగర్, ఈసీఐఎల్, నేరేడ్‌మెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. దివ్యాంగుల భావాలను వ్యక్తపరుస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కరపత్రాలు పంచుతూ విద్యార్థులు ర్యాలీగా వెళ్లారు. దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా వారికి కూడా అవకాశం కల్పించి సమాజంలో సమానత్వం పాటించాలని అనురాగ్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ కోరారు. దివ్యాంగుల హక్కులను ప్రోత్సహించడం, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమ అనంతరం దివ్యాంగ విద్యార్థులకు బిందు స్వీట్లు, బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?



రంగారెడ్డినగర్: ఏదైనా అభివృద్ధి పని చేపట్టే ముందు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, నీటి పంపులు సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని తొలగించిన తరువాత చేపట్టాల్సి ఉంటుంది. కానీ సర్కిల్ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనడానికి రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సంజయ్‌గాంధీనగర్‌లోని గ్రేవ్ యార్డు వరకు ఇటీవల పూర్తి చేసిన రోడ్డు పనులనే ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇటీవల రూ.25 లక్షల నిధులతో జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని సంజయ్‌గాంధీనగర్ నుంచి హిందూ శ్మశానవాటిక వరకు రోడ్డు పనులను చేపట్టారు. గత కొన్నేళ్లుగా రోడ్డు మధ్యలో చేతి పంపు వృథాగా ఉంది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే రోడ్డు పనులు చేపట్టే సమయంలో సర్కిల్ అధికారులు చేతి పంపును తొలగించాల్సిందిగా జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారికి లిఖిత పూర్వకంగా లేఖ రాయాల్సి ఉంటుంది. కానీ ఇరు శాఖల మధ్య సమన్వయం కొరవడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ చేతి పంపు ఉండగానే రోడ్డు పనులు పూర్తి చేశాడు. దీంతో ప్రస్తుతం రోడ్డు మధ్యలో చేతిపంపు అడ్డుగా మారింది. దీంతో రాత్రి వేళల్లో చేతి పంపును గమనించక పలువురు వాహనదారులు ఢీకొంటున్నారు. పని చేయని చేతి పంపును ఎందుకు తొలగించడం లేదని, ఇటు జీహెచ్ఎంసీ, అటు జలమండలి అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో లక్షలాది నిధులతో ఏర్పాటు చేసిన రోడ్డులో రాకపోకలకు చేతి పంపు ఆటంకంగా మారుతోందని, ఇప్పటికైనా ఇరు శాఖల అధికారులు ఇగో విడనాడి రాకపోకలు సజావుగా కొనసాగేలా చేతి పంపును తొలగించాలని పలువురు కోరుతున్నారు.

మహాభాగ్యం.. బ్రహ్మసూత్ర లింగ దర్శనం

- అత్వెల్లిలో దక్షిణకాశీగా అభివృద్ధి
- ఆలయానికి పెరుగుతున్న భక్తులు



అత్వెల్లి బ్రహ్మసూత్ర శివాలయం



గర్భగుడిలో బ్రహ్మసూత్ర లింగం

మేడ్చల్: దేశవ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాల్లో బ్రహ్మసూత్రం ఉన్న శివాలయాలది ప్రత్యేక స్థానం. సాధారణంగా శివాలయాల్లో శివలింగం స్పటిక, మరకత తదితర రూపాల్లో నునుపుగా ఉంటుంది. బ్రహ్మసూత్ర లింగాల్లో మాత్రం లింగం ముందర భాగంలో గీతలతో చెక్కబడి ఉంటుంది. ఇలాంటి లింగాలను దర్శిస్తే కోటి లింగాలను దర్శించినంత పుణ్యఫలం వస్తుందని పురాణాలు, వేద పండితులు చెబుతున్న మాట. బ్రహ్మసూత్ర లింగాలు ఉన్న ఆలయాలు అరుదుగా ఉంటాయి. అలాంటి బ్రహ్మసూత్ర లింగం ఉన్న ఆలయం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి ఉంది. గ్రామం ఏర్పడినప్పటి నుంచి గ్రామంలోని వేంకటేశ్వర ఆలయం పక్కన గుడిబండపై లింగం ఉండేది. ఆ లింగం చుట్టూ గీతలు ఉన్నాయి. అరుదుగా శివలింగాలపై ఉండే గీతలు బ్రహ్మసూత్ర లింగమని, దాని విశిష్టత తెలియని వారు ఆ శివుడి ఆలనా పాలనా పట్టించుకునే వారు లేకపోవడంతో చరిత్ర కనుమరుగైంది.

నీడ లేని సమయం నుంచి..

గ్రామానికి చెందిన కొందరు శివలింగంపై, నందీశ్వరుడిపై రేకులతో షెడ్లు వేసి నీడ కల్పించగా పూజలు మొదలుపెట్టారు. ఏళ్లుగా ఎలాంటి ఆలయం లేకుండా సాగింది. గుడి బండపై శివలింగం ఉండటంతో పూజలు, దూపదీపం లేకుండా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఆ శివయ్య ఉండిపోయాడు.

భక్తుల కోసం..



పూజలు లేకుండా ఆరుబయట ఉన్న శివయ్యకు ఆలయం కల్పించే భాగ్యం కలగడం అదృష్టం. చాలా సంవత్సరాల నుంచి శివలింగానికి పూజలు చేశాం. దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించాం. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాం. నిత్య పూజలు చేస్తూ భక్తులకు బ్రహ్మసూత్ర లింగ దర్శనం కల్పించేందుకు ఆలయ నిర్మాణం చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నాం.

– రొయ్యపల్లి మల్లేష్‌గౌడ్ సరిత దంపతులు

దక్షిణ కాశీగా..

గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్, ఆయన భార్య కౌన్సిలర్ సరిత కలిసి రూ.లక్షలు వెచ్చించి ఆలయ నిర్మాణం చేపట్టారు. వారణాసి నగరంలో ఉండే విధంగా గర్భగుడికి నాలుగు ద్వారాలు ఏర్పాటు చేసి నిర్మించారు. దీంతో ఆలయం స్థానికంగా దక్షిణ కాశీగా పేరుగాంచింది. చెరువు ఒడ్డున ఆలయం నిర్మించి చుట్టూ ఉద్యానవనం అభివృద్ధి చేయడం, విద్యుత్ దీపాల వెలుగులు ఏర్పాటు చేయడం, రోడ్లు, ఇతర వసతులు ఏర్పాటు చేయడం, మరోపక్క వెంకటేశ్వర ఆలయం ఉండటంతో అనతి కాలంలోనే ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది.